క్లుప్తంగా

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి జెడ్పీటీసీ గుండం నర్సయ్య బుధవారం భూమిపూజ చేశారు. తుర్కపల్లి గ్రామానికి 25 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కాగా, లబ్ధిదారులకే నేరుగా రూ.5 లక్షలు అందించడం జరుగుతుందని అన్నారు. పాత పథకంలో మంజూరైన ఇళ్లకు లబ్ధిదారులను సర్పంచ్, పాలకవర్గం ఎంపిక చేసిందన్నారు. వారందరు సొంతంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకునేందుకు మంత్రి కేటీఆర్ చొరవ చూపారన్నారు. మరో రెండు నెలల్లోనే పనులు పూర్తయితే గృహప్రవేశాలు చేయాలన్నారు. సర్పంచ్ కాశోల్ల పద్మ, ఉపసర్పంచ్ కృష్ణవేణి, దుర్గప్రసాద్, బాలకృష్ణ, దేవదాస్, నర్సయ్య, భాను పాల్గొన్నారు.

నిరుపేదలపై పట్టింపేది..?

- సీపీఐ నాయకుల మండిపాటు



మురుగును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి వార్డులో ఉన్న నిరుపేదలు చాలా రోజులుగా ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు నాయకులు కడారి రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బుడిగ జంగాలకాలనీలో వారు పర్యటించి మురుగు నీటి కాలువల వల్ల వారు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. వర్షాకాలంలో నీరు చేరి వారి గుడిసెల్లో ఉండలేకపోతారని, ఆ సమయంలో మాత్రమే నాయకులు వెళ్లి పరామర్శిస్తారు తప్ప తరువాత వారిని పట్టించుకోవడం లేదన్నారు. దాదాపు 40 కుటుంబాలు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ వారికి కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలోనే ఓట్ల కోసం వారికి మాయమాటలు చెబుతారని, తదుపరి మాత్రం అటువైపు వెళ్లడం లేదన్నారు. ఇప్పటికైనా పాలకులు వెంటనే స్పందించి వారి ఇబ్బందులు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట పట్టణ కార్యదర్శి యెల్ల దేవరాజు, గాజుల పోచెట్టి, కోరెపు శ్రీను పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోనరావుపేట: వరిని సాగు చేస్తున్న రైతులు వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ కోరారు. వరి నాట్లు వేసిన 15 తర్వాత సల్ఫైడ్ గాయం ప్రభావం కనిపిస్తుందని, దీని నివారణ కోసం రైతులు తమ కమతాల్లో చీమ పగుళ్లు వచ్చేంత వరకు వారం నుంచి 10 రోజుల వరకు పొలాన్ని ఆరబెడుతూ నీటిని అందించడం వల్ల సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో చేరిపోతుందన్నారు. అలాగే వరిలో మొగి పురుగు, ఆకుముడత పురుగు గమనించినట్లైతే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కిలోలు గానీ లేదా కార్బోఫ్యూరాన్(3జీ) గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున పొలంలో చల్లితే పురుగు ఉధృతి తొలగిపోతుందన్నారు. రైతులకు ఇంకా ఏమైనా సమాచారం కావాలంటే తమను సంప్రదించాలన్నారు.

రాబడిపై పంచాయతీల నిర్లక్ష్యం

- ప్రత్యామ్నాయ ఆదాయంపై పట్టింపు కరువు
- కాంటా పన్ను వసూళ్లపై దృష్టిపెట్టని పంచాయతీలు
- ఏటా రూ.12 లక్షల ఆదాయానికి గండి
- ఇంటి పన్ను, ప్రభుత్వం నిధులే దిక్కు



రామన్నపేటలో ప్రైవేట్ వ్యాపారి కొనుగోలు చేస్తున్న ధాన్యం (ఫైల్)

చందుర్తి: పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించింది. కానీ ఆయా గ్రామ పంచాయతీలు ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే నిధులు, ఇంటి పన్నులు మినహా చట్టానికి లోబడి ఇతరత్రా ఆదాయంపై దృష్టి సారించడం లేదు. ప్రత్యామ్నాయ రాబడిపై కార్యదర్శులు, అధికారులు దృష్టిపెట్టకపోవడంతో ఏటా మండలంలోని గ్రామపంచాయతీలు రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నాయి.

కాంటా రుసుం వసూళ్లపై దృష్టి కరువు

గ్రామాల్లో రైతులు పండించిన పంటను వ్యాపారులు కాంటా పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కాంటా రుసుము కింద క్వింటాలుకు కొత్త మొత్తాన్ని పంచాయతీ తీర్మానం మేరకు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వాటి వసూళ్లు సరిగ్గా జరగడం లేదు. మండలంలో ఎక్కువ శాతం వ్యవసాయధారులే కావడం వల్ల ప్రతి గ్రామపంచాయతీలో ఈ పద్ధతిలో నిధులు పన్నుల రూపంలో సమకూర్చుకునే అవకాశం ఉంది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 కూడా పన్నుల వసూళ్లకు సంబంధించిన జాబితాలో దీన్ని అగ్రభాగంలో పేర్కొన్నారు. కానీ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు ఎవరూ ఈ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

ప్రభుత్వ నిధులు, ఇంటి పన్నులపైనే ఆధారం

ప్రస్తుతం చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిన తర్వాత ప్రతీ గ్రామపంచాయతీకి ఒక కార్యదర్శి, జనాభా ప్రాతిపదికన మల్టీపర్పస్ వర్కర్లను నియమించారు. పారిశుధ్య పనుల కోసం, మొక్కలకు నీటిని అందించేందుకు ట్యాంకర్లను అందుబాటులోకి తెచ్చింది. ఇక వీధి దీపాలు, బ్లీచింగ్ పౌడర్ వంటి అవసరాలు ఉంటాయి. ఇలాంటి వాటి నిర్వహణకు ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులు కొంతమేరకు సరిపోతున్నాయి. కానీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరులో జాప్యం జరిగితే పాలకవర్గానికి దిక్కు తోచడం లేదు.

సిబ్బంది ఉన్నా నిర్లక్ష్యమే..

గతంలోపంచాయతీలకు ఒక కారోబార్ సహకారంతో గ్రామపంచాయతీ కార్యదర్శులే పనులన్నింటిని వసూలు చేసేవారు. రెండు, మూడు గ్రామ పంచాయతీలకు కలిపి ఒక్కరే పంచాయతీ కార్యదర్శి ఉన్నప్పటికీ అన్ని పనులను సజావుగా సాగేవి. కానీ ప్రస్తుతం ప్రతి గ్రామపంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించారు. అయినా పన్ను వసూళ్లలో మాత్రం వెనకబడి ఉన్నారు.

ఏటా రూ.లక్షల్లో నష్టం

మండలంలో వానకాలంలో వరి 13,800 ఎకరాల్లో, పత్తి 7,200 ఎకరాల్లో, ఇతర పంటలు 500 ఎకరాల్లో సాగు చేస్తుంటారు. యాసంగిలో 14 వేల ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో నువ్వు, ఇతర పంటలు 450 ఎకరాల్లో సాగు చేస్తారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం వరి ఎకరాకు 18 క్వింటాల్ నుంచి 27 క్వింటాళ్ల వరకు, పత్తి ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటాల్‌కు రూ.రెండు చొప్పున వసూలు చేసినా, పంచాయతీలకు సుమారు రూ.12 లక్షల వరకు ఆదాయం వస్తుంది. కానీ ఈ ఆదాయంపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించడం లేదు. ఇంటి పన్ను తప్పా, కాంటా పన్ను వసూలు చేయడం లేదు.

పంచాయతీ తీర్మానం చేశాం



గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చే ప్రతి పన్ను వసూలు చేయాలని పాలకవర్గంతో తీర్మానం చేయించాం. పంచాయతీ కార్యదర్శి పన్నుల వసూలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే వారికి మినహాయించి, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసే ధాన్యం కాంటా రుసుం వసూలు చేసేందుకు తీర్మానించాం.

– చిలుక అంజిబాబు, సర్పంచ్, మూడపల్లి

ఆదేశాలు జారీ చేశాం



ఇంటి పన్నులు, ఇతరత్రా పన్నులు వసూలు చేసేలా సిబ్బంది ఆదేశాలు జారీ చేశాం. గ్రామపంచాయతీల వారీగా ఏ గ్రామపంచాయతీకి ఎన్ని పన్నులు వసూలు చేస్తున్నారో సమావేశాల్లో చర్చిస్తున్నాం. ఆదాయాన్ని సమకూర్చే ప్రతి పన్నును గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసుకుని వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం.

– బండి ప్రదీప్‌కుమార్, ఎంపీవో, చందుర్తి

పవర్ కట్

నేడు విద్యుత్ అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్‌కాలనీ, రాజీవ్‌నగర్, చెక్కపల్లిరోడ్డు, అంజనీనగర్, విద్యానగర్, సాయినగర్, మల్లారం రోడ్డు, కోరుట్ల బస్టాండు ఏరియాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరా నిమిత్తం లైన్లు సరిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. సెస్ వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

రుద్రంగిలో..

రుద్రంగి: రుద్రంగి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఫిట్టింగ్ పనులు జరగనున్న నేపథ్యంలో ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ సెస్ ఏఈ స్రవంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచారం

నేడు బోయినపల్లి మండల సమావేశం

బోయినపల్లి: బోయినపల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు. అలాగే ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయాలి

- ఏర్పాట్లు పరిశీలన
- నేటి నుంచి కంటి పరీక్షలు ప్రారంభం



తంగళ్లపల్లి శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ



ఎల్లారెడ్డిపేట: ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అంకారపు అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.లచ్చాలు, తంగళ్లపల్లి పీహెచ్‌సీ మెడికల్ అధికారి స్నేహ, వైద్య సిబ్బంది రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకుడు పడిగెల రాజు పాల్గొన్నారు. అలాగే తంగళ్లపల్లి పీహెచ్‌సీ ఆవరణలో తంగళ్లపల్లి, నేరెళ్ల, చీర్లవంచ పీహెచ్‌సీల మెడికల్ అధికారులు స్నేహ, రేఖ, రామకృష్ణ మీడియా సమావేశం ఏర్పాటు చేసి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముస్తాబాద్: స్థానిక కంటి వెలుగు శిబిరాన్ని కంటి వెలుగు ప్రత్యేకాధికారి సురేశ్, ఎంపీడీవో రమాదేవి బుధవారం పరిశీలించారు. వైద్యాధికారి గీతాంజలి, హెచ్‌ఈవో యాదగిరి, కార్యదర్శి రాజు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశలు ఉన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆశాలు, మహిళా సంఘాల సీఏలతో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో మాలోతు శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేట రైతు వేదికలో మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సెల్‌ఫోన్‌ను వెంట తెచ్చుకుని పరీక్షలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

కోనరావుపేట: కోనరావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభిస్తున్నట్లు పోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి వేణుమాధవ్, హెల్త్‌సూపర్‌వైజర్లు శ్రీదేవి, సువర్ణ, హెల్త్‌అసిస్టెంట్ అశోక్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, విలాసాగర్ పీహెచ్‌సీ కేంద్ర గ్రామాల్లో గురువారం కంటివెలుగు వైద్య శిబిరాలు ప్రారంభించనున్నట్లు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు రేణు ప్రియాంక, రేణుక, అనిత తెలిపారు. బోయినపల్లిలో నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి బుధవారం పరిశీలించారు. వైద్యాధికారిని స్రవంతి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి
- వేములవాడ టౌన్ సెస్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నామాల ఉమ



సెస్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వేములవాడ: వేములవాడ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ సెస్ డైరెక్టర్లు రామతీర్థపు రాజు, జడల శ్రీనివాస్, పొలాస నరేందర్ అన్నారు. టౌన్ సెస్ డైరెక్టర్‌గా నామాల ఉమ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సెస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుధవారం వారు పాల్గొని మాట్లాడారు. సెస్ వినియోగదారులకు సొంత భవనం ఉండేలా చొరవ తీసుకోవాలని సూచించారు. నామాల ఉమ మాట్లాడుతూ తమపై విశ్వాసంతో తనను గెలిపించిన సెస్ వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తనకున్న అనుభవంతో వేములవాడ వాసులకు విద్యుత్ సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నరాల శేఖర్, ఇప్పపూల విజయ్, కో–ఆప్షన్ సభ్యులు బాబూన్, నాయకులు పుల్కం రాజు, కొండ కనుకయ్య, సెస్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో పాఠశాల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో బహుమతులు సాధించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎర్త్ ఫౌండేషన్ దత్తత తీసుకున్న పాఠశాలల్లోని చిన్నారుల మధ్య ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్, వ్యాసరచన, ఉపన్యాస, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. హుజురాబాద్‌లోని ఏకశిల పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో నిజామాబాద్ పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ రకాల పోటీల్లో పాల్గొని 22 బహుమతులు సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ఎంఈవో దూస రఘుపతి, ప్రధానోపాధ్యాయులు సత్తు రవీందర్, సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, ఎస్‌ఎంసీ చైర్మన్ చిరంజీవి, వైస్‌ఎంపీపీ సుమలత అభినందించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, తదితరులు

కోనరావుపేట: మరిమడ్ల నుంచి మానాల వరకు నిర్మించే రహదారి కోసం మరో రూ.9 కోట్లు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలం మరిమడ్లలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటానికి సర్పంచ్ మాట్ల అశోక్ ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ నిధులతో మొత్తం నిధులు రూ.17.50 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరుకు సహకరించిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకుల చంద్రం, వార్డు సభ్యులు కోల శ్రీనివాస్, సంతోష్, గంగాధర్, వేములవాడ ఏఎంసీ డైరెక్టర్ రాజేశం, నాయకులు సింగం రాములు, శంకరయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బాల్యమిత్రుల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని అక్కపల్లి గ్రామానికి చెందిన కంది బాల్‌రాం(40) కుటుంబానికి ఆయన బాల్య స్నేహితులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. నాయిబ్రహ్మణ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే బాల్‌రాం మృతితో ఆ కుటుంబం రోడ్డున పడడంతో చిన్ననాటి మిత్రులంతా కలిసి రూ.23,500 నగదు అందించారు. సర్పంచ్ మధుకర్, ఉపసర్పంచ్ ప్రదీప్‌రెడ్డి,సునిల్, రమేశ్, బాబు, భాస్కర్, రాజు, బాల్‌నర్సు, మల్లేశ్ పాల్గొన్నారు.

కాటికాడ కష్టమే..!



అసంపూర్తి నిర్మాణంతో నిరుపయోగంగా ఉన్న గదులు

- లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు
- అసంపూర్తి నిర్మాణంగా శ్మశానవాటిక
- బర్నింగ్ ప్లాట్‌ఫామ్ లేక అవస్థలు
- కనీస మౌలిక వసతులు కరువు
- అంత్యక్రియలకు ఇబ్బందులు

సిరిసిల్లఅర్బన్: ఆఖరు మజిలీ గౌరవప్రదంగా జరగాలని రాష్ట్ర ప్రభుత్వం ఊరూరా వైకుంఠధామాలను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. కానీ ప్రభుత్వ లక్ష్యం పూర్తిస్థాయిలో నేరవేరడం లేదు. కొన్నిచోట్ల అసంపూర్తిగా, మరికొన్ని చోట్ల ముహుర్తాలకే పరిమితమయ్యాయి. అటు అధికారుల నిర్లక్ష్యం, ఇటు పాలకుల పట్టించుకోకపోవడంతో శ్మశానవాటికలు నిర్మాణానికి నోచుకోవడం లేదు. కనీస వసతులు లేక నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సిరిసిల్ల పట్టణ శివారు చంద్రంపేటలో గ్రామ పంచాయతీ హయంలో ప్రస్తుత కొత్త చెరువును ఆనుకొని శ్మశానవాటిక నిర్మాణ పనులు చేపట్టారు. కేవలం గదుల నిర్మాణం మాత్రమే చేపట్టారు. అవి కూడా అసంపూర్తిగా కట్టి, బర్నింగ్ ప్లాట్ ఫామ్‌లను ఏర్పాటు చేయలేదు. దీంతో అంత్యక్రియలు జరిపేందుకు ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేశారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలో దాదాపు ఐదేళ్ల క్రితం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో కొత్త చెరువు సమీపంలో లక్షలు వెచ్చించి శ్మశానవాటిక నిర్మాణం పనులు చేపట్టారు. రెండు గదులను నిర్మించి వదిలిపెట్టారు. బర్నింగ్ ప్లాట్ ఫామ్ నిర్మించలేదు. రోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యాలు లేకపోవడంతో దహన సంస్కారాలకు వచ్చిన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్‌లో వీలినమై ఏళ్లు గడుస్తున్న శ్మశానవాటికను నిర్మించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వైకుంఠధామానికి వెళ్లేందుకు రోడ్డు కూడా సరిగా లేదని మట్టితో చదును చేసినట్లు తెలిపారు. వసతులు కల్పించి ఉపయోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఉపయోగంలోకి తేవాలి

వైకుంఠధామాలను లక్షలు వెచ్చించి నిర్మించగా అధికారుల పర్యవేక్షణ లోపంతో నిరుపయోగంగా మారాయి. గ్రామంలో ఏవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయిలో నిర్మించి ఉపయోగంలోకి తేవాలి

– సూర దేవరాజు, చంద్రంపేట

ఇబ్బంది పడుతున్నం

అసంపూర్తి స్థితిలో వైకుంఠదామం ఉండడంతో దహన సంస్కారాలకు ఇబ్బంది పడుతున్నారు. ఆఖరి మజిలీ గౌరవ ప్రదమేమో గానీ మౌలిక సౌకర్యాలు మాత్రం లేవు. పాలకులు, అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, శ్మశానవాటికలను ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– పులి రాకేష్, చంద్రంపేట

గౌడ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్దన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణగౌడ్ బుధవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా బండి దేవదాస్‌గౌడ్, బొల్గం నాగరాజుగౌడ్, సంపునూరి మల్లేశంగౌడ్, శ్రీనాథ్‌గౌడ్, కోశాధికారి కొండ రమేశ్‌గౌడ్, సహాయ కార్యదర్శులు బాలసాని అంజయ్య, తీగల రవిందర్, నాగుల సాంబయ్య, బుర్ర ఉపేందర్, న్యాయ సలహాదారులుగా మహేశ్‌గౌడ్, పర్శరాములు, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బందారపు బాల్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేములవాడ: పట్టణంలోని గంగపురం భూలక్ష్మి, గంగపురం సురేశ్, బ్రహ్మ కృష్ణవేణికి కౌన్సిలర్ నరాల శేఖర్ రూ.54 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు.

కోనరావుపేట: మండలం నాగారంలో అప్పాల శివవ్వకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ బాస లావణ్య, మాజీ ఎంపీటీసీ తీగల రవీందర్‌గౌడ్ అందజేశారు. నాయకులు ఊరడి రాజయ్య, ఉపసర్పంచ్ నాగరాజు, వార్డు సభ్యుడు ఎల్లం పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్ని వసతులు



కేసీఆర్ కిట్ అందజేస్తున్న వైద్యాధికారి

కోనరావుపేట: స్థానిక పీహెచ్‌సీలో అన్ని రకాల వసతులు అందిస్తున్నట్లు మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. ఆసుపత్రిలో మండలంలోని మరిమడ్లకు చెందిన గంట స్వప్నకు డాక్టర్లు సాధారణ ప్రసవాన్ని చేశారు. బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆమెకు కేసీఆర్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి వెలుగు ప్రత్యేకాధికారి డాక్టర్ ఉమ, సూపర్‌వైజర్లు శ్రీదేవి, సువర్ణ, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.